సాక్షి తిరుపతి

సోమవారం । 18 । నవంబర్ । 2024



'హార్స్'పవర్.. అదుర్స్!

తిరుపతి ఎన్‌సీసీ క్యాడెట్లు జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్నారు. రిపబ్లిక్ డే పరేడ్‌కు శిక్షణ పొందుతున్నారు. - 8లో



నవజాత శిశువుల రక్షణపై అవగాహన

నవజాత శిశువుల రక్షణపై అవగాహన కల్పిస్తూ తిరుపతిలో ఆదివారం 5కే వాక్ ర్యాలీ నిర్వహించారు. - 8లో



పిల్లలను తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

రైలులో అక్రమంగా పిల్లలను తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు లక్ష దీపోత్సవం



భరద్వాజ తీర్థం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని భరద్వాజ తీర్థంలో కార్తీక మాసం సందర్భంగా సోమవారం లక్ష దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమయ్యే దీపోత్సవానికి భక్తులు తరలిరావాలని కోరారు.

నేడు కలెక్టరేట్‌లో 'గ్రీవెన్స్'

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం తిరుపతి కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. అయితే వివిధ సమస్యలతో వచ్చే అర్జీదారులకు కలెక్టరేట్ వద్ద కనీస వసతులు కల్పించాలని పలువురు కోరుతున్నారు. ప్రధానం కుర్చీలు, తాగునీటి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలని సూచిస్తున్నారు. అలాగే గత ప్రభుత్వంలో మాదిరిగా వినతులు రాసేందుకు వీఆర్‌ఓలను ఏర్పాటు చేయాలని విన్నవిస్తున్నారు. సెంట్రల్ బస్టాండ్ నుంచి అర్జీదారులు రాకపోకలు సాగించేందుకు ప్రత్యేక బస్సు నడపాలని కోరుతున్నారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 17 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 73,179 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 25,602 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.4.03 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలో సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించమని స్పష్టం చేసింది.

గత ఆర్డీఓపై సస్పెన్షన్ ఎత్తివేత

తిరుపతి అర్బన్: పూర్వపు ఆర్డీఓ నిశాంత్‌రెడ్డిపై ప్రభుత్వం విధించిన సస్పెన్షన్ ఎత్తివేసింది. పుత్తూరులో ఓ పెట్రోల్ బంక్ అనుమతికి సంబంధించి ఎన్‌వోసీ జారీ చేసే అంశంలో నిశాంత్‌రెడ్డి నగదు డిమాండ్ చేశారని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో గతంలో రెండు నెలల పాటు సస్పెన్షన్ విధించారు. దీంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో కోర్టు ఆ అంశంపై పూర్తి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌ను ఆదేశించింది. విచారణలో ఆర్డీఓపై వచ్చిన ఆరోపణల విషయంలో నిజం లేదని తేల్చడంతో ఆయన సస్పెన్షన్ ఎత్తివేస్తున్నట్లు సీసీఎల్‌ఏ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు జారీచేశారు.

పల్లెసీమల్లో గ్రామ సమాఖ్య సహాయకులు తలలో నాలుకలా వ్యవహరిస్తుంటారు. గ్రామీణులకు అనేక సేవలందిస్తుంటారు. ముఖ్యంగా పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూతనందిస్తుంటారు. కేవలం గౌరవ వేతనంతో విధులు నిర్వర్తించే ఈ చిరుద్యోగులపై పచ్చ నేతలు తమ ప్రతాపం చూపిస్తున్నారు. రాజకీయ రంగు పులిమి పొట్టగొట్టేందుకు తెగబడుతున్నారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి ఉద్యోగాలకు ఎసరు పెట్టేస్తున్నారు. ఈ క్రమంలోనే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఇప్పటి వరకు సుమారు 150 మందిని తొలగించి వారి కుటుంబాలను రోడ్డున పడేశారు. మరింత మందిపై వేటు వేయించేందుకు కుట్రలు పన్నుతున్నారు. స్వచ్ఛందంగా తప్పుకోవాలని కొందరిని వేధిస్తున్నారు. మాట వినకుంటే ఇబ్బందులు తప్పవని బెదిరిస్తున్నారు.



వీఓఏల తొలగింపునకు డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు(ఫైల్)

వేధిస్తూ.. తొలగిస్తూ!

- చిరుద్యోగులపై పచ్చ నేతల ప్రతాపం
- గ్రామ సమాఖ్య సహాయకులకు బెదిరింపులు
- జిల్లాలో ఇప్పటికే 150 మందిపై వేటు
- మరింత మందిని తొలగించాలని ప్రజాప్రతినిధుల సిఫార్సులు
- ఒత్తిడికి తలొగ్గుతున్న డీఆర్‌డీఏ, వెలుగు అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : తిరుపతి జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1,280 మంది గ్రామ సమాఖ్య సహాయకులు (విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్) విధులు నిర్వహిస్తున్నారు. వీరందరూ దాదాపు 10 నుంచి 15 ఏళ్లుగా పనిచేస్తున్నవారే. చిరుద్యోగులు అయినప్పటికీ గ్రామాల్లో ప్రజలకు అనేక సేవలందిస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వీఓఏల పరిస్థితి దారుణంగా తయారైంది. వారిని ఉద్యోగాల నుంచి తొలగించి తమకు అనుకూలంగా ఉన్న వారిని నియమించుకునేందుకు కూటమి నేతలు కుట్రలు చేస్తున్నారు. ఈ మేరకు ప్రజాప్రతినిధులు లిఖిత పూర్వకంగా అధికారులకు సిఫార్సు లేఖలు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకు తిరుపతి జిల్లాలో 150 వరకు వీఓఏ లను ఎలాంటి సమాచారం లేకుండా తొలగించడం గమనార్హం.

గ్రామ స్థాయిలో కీలక బాధ్యతలు...

పది నుంచి 20 డ్వాక్రా సంఘాల సమూహానికి ఒక వీఓఏ ఉంటారు. నెలకు రూ.8వేలు చొప్పున వారికి గౌరవ వేతనం వస్తుంది. అయితే ప్రభుత్వం ఆ మొత్తాన్ని కూడా నేరుగా వారి ఖాతాల్లో జమ చేయడం లేదు. గ్రామైక్య సంఘాల ఖాతాల్లో వేసేస్తోంది. తర్వాత ఆ సంఘం లీడర్ ద్వారా వీఓఏలకు వేతనం అందిస్తున్నారు. ఈ క్రమంలో నిబంధనల ప్రకారం ఎప్పుడైనా వీఓఏను తొలగించాలంటే పొదుపు సంఘాలే తీర్మానం చేయాలి. వాస్తవానికి డ్వాక్రా సంఘాలకు స్వతంత్రంగా వ్యవహరించే అధికారం ఉంది. అయితే పలువురు పింఛన్‌దారులు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఆయా పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. వారు టీడీపీ నేతల బెదిరింపులకు భయపడుతున్నారు. వారిని ఎదిరిస్తే తమకు పథకాలు అందవేమో అని మధనపడుతున్నారు. దీంతో పచ్చ నేతలు చెప్పిన మాటకు తలొగ్గుతున్నారు. ఇదే అదునుగా టీడీపీ నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి వీఓఏలను తొలగింపజేస్తున్నారు. కొన్నిచోట్ల తీర్మానాలు లేకుండా కూడా వీఓఏలను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



తమ వల్ల కాదంటున్న అధికారులు

కూటమి నేతలు తమకు అనుకూలంగా ఉన్న వారిని వీఓఏలుగా నియమించుకుంటున్నారు. అయితే వారితో పనులు చేయించుకోవడం తమ వల్ల కాదని మండల స్థాయిలో ఎంపీడీఓలు, ఏపీఎంలు తేల్చి చెబుతున్నారు. ఎలాంటి అనుభవం లేని వారిని నియమించుకుంటే కార్యక్రమాలు ముందుకు సాగవని వెల్లడిస్తున్నారు. అయినప్పటికీ కూటమి ప్రజా ప్రతినిధులు మాత్రం మేము చెప్పింది మీరు వినాల్సిందే అంటూ తమ అనుచరులకు ఆ పోస్టులు కట్టబెడుతున్నారు. ఈ క్రమంలో తొలగించబడిన వీఓఏలు తమకు న్యాయం చేయాలని హైకోర్టును ఆశ్రయించారు.

సర్వత్రా ఆందోళన

కూటమి ప్రభుత్వం కొత్త ఉద్యోగాలు సృష్టించి యువతకు ఉపాధి చూపకుండా ఉన్న వాటిని ఊడదీస్తుండడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రాంగణం ధర్నాలతో దద్దరిల్లుతోంది. ఆదుకోవాలంటూ అధికారులకు పెద్దసంఖ్యలో అర్జీలు అందుతున్నాయి. కూటమి నేతల వేధింపులతో తొలగింపులకు గురైన వీఓఏల గోడును ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రధానంగా టీడీపీ నేతలు తమకు అనుకూలంగా ఉండేవారిని వీఓఏలుగా నియమించుకునేందుకు చెలరేగిపోతున్నారు. తాము చెప్పినట్లు వినకుంటే బదిలీ తప్పదని వెలుగు, డీఆర్‌డీఏ అధికారులను బెదిరిస్తున్నారు. దీంతో వెలుగు, డీఆర్‌డీఏ అధికారులు ఏళ్ల తరబడి సేవలందిస్తున్నవారిని సైతం నిర్దయగా తొలగిస్తున్నారు. ముఖ్యంగా తిరుపతి, చంద్రగిరి, నాయుడుపేట, గూడూరు, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో ఇదే తతంగం నడుస్తోంది.

సరైన పద్ధతి కాదు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చిరుద్యోగుల తొలగింపులకు దిగడం సరైన పద్ధతి కాదు. అధికార పార్టీ నేతలు తమ ధోరణి మార్చుకోవాలి. రాజకీయాలకు సంబంధం లేని వీఓఏలను తొలగించడం వల్ల ఏం సాధిస్తారు.ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తొలగింపులు చేపట్టడం దారుణం. ఉద్యోగం పోగొట్టుకున్నవారికి న్యాయం చేయాలి. వీఏఓల పొట్ట గొట్టడం సబబు కాదు.

– వందవాసి నాగరాజు, సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి

క్షేత్రస్థాయిలో విచారణ



అకారణంగా వీఓఏ లను తొలగించకూడదని ఆదేశించాం. ఎలాంటి తప్పులు చేయకుండా ఎవరినైనా తొలగించి ఉంటే చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా జరిగి ఉంటే క్షేత్రస్థాయిలో విచారణ చేపడుతున్నాం. ఎవరినైనా ఎందుకు తొలగించారు అనే కారణాలను పూర్తిస్థాయిలో తెలుసుకుంటాం.

– శోభన్‌బాబు, డీఆర్‌డీఏ పీడీ

కుటుంబాలను రోడ్డున పడేశారు



ఎన్నో ఏళులగా ఉద్యోగాన్నే నమ్ముకుని పనిచేస్తున్న వారిని వీఓఏలను, వారి కుటుంబాలను రోడ్డున పడేశారు. చిరుద్యోగులను తొలగించడం వల్ల వారి బతుకులు ఎంత ఇబ్బందులు పడాల్సి వస్తుందో కూటమి నేతలకు అర్థం కాదా. వీఓఏ ల పొట్టగొట్టడం ఎంత వరకు అన్యాయం. తొలగించిన వారందరికీ ఖచ్చితంగా న్యాయం చేయాలి. ప్రత్యామ్నాయం చూపించాలి. అప్పటి వరకు పోరాటాలు కొనసాగిస్తాం.

– మురళి, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి

డిసెంబర్ 1న అంతర్రాష్ట్ర అథ్లెటిక్స్

నాయుడుపేటటౌన్ : పట్టణంలో డిసెంబర్ 1వ తేదీన అంతర్రాష్ట్ర అథ్లెటిక్స్ నిర్వహించనున్నట్లు ఎస్‌ఎస్‌ఎఫ్ నిర్వాహకుడు మోమిడి లక్ష్మయ్య తెలిపారు.ఆదివారం స్థానిక ఆయుర్వేద వైద్యశాల వద్ద అథ్లెటిక్స్ పోస్టర్ ఆవిష్కరించారు. లక్ష్మయ్య మాట్లాడుతూ జాతీయ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా 7వ అథ్లెటిక్ పోటీలు జరిపిస్తున్నట్లు వెల్లడించారు. 6 నుంచి 16 ఏళ్ల బాలబాలికలకు ఆరు విభాగాల్లో పోటీలు ఉంటాయని వివరించారు. విజేతలకు నగదు బహుమతులు, సర్టిఫికెట్ అందించనున్నట్లు చెప్పారు. వివరాలకు 94405 51278 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ముసునూరు అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నేడు టీటీడీ పాలకమండలి సమావేశం

తిరుమల: తిరుమలలో టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం చైర్మన్ బీఆర్.నాయుడు అధ్యక్షతన సోమవారం ఉదయం అన్నమయ్య భవనంలో జరగనుంది. ధర్మకర్తల మండలి సమావేశంలో ప్రధానంగా 80 అంశాలతో కూడిన ఎజెండాపై చర్చించనున్నారు. వైకుంఠ క్యూ కాంప్లెక్స్ ఒకటిని అందుబాటులో తేవనున్నారు. కొండపైన అన్యమత ప్రచారాన్ని పూర్తి రద్దుచేయనున్నారు. స్వామివారి నైవేద్యాలు, లడ్డూ ప్రసాదాలు, అన్న వితరణ కేంద్రంలో వినియోగించే ఆహార ఉత్పత్తుల నాణ్యతను పెంచేందుకు కొత్తగా టెండర్లు ఆహ్వానించనున్నారు. ఇంజినీరింగ్ పనులకు గతంలో నిధుల కేటాయింపులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ విజిలెన్స్ విచారణలో ఉండడంతో వీటిపైనా పరిశీలన చేయనున్నారు.

రామ్మూర్తి నాయుడుకి కన్నీటి వీడ్కోలు



రామ్మూర్తి నాయుడి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు తదితరులు

చంద్రగిరి: చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే, సీఎం చంద్రబాబు నాయుడు తమ్ముడు నారా రామ్మూర్తి నాయుడు అంతిమ సంస్కారం కుటుంబ సభ్యులు, బంధువులు, ఆత్మీయుల మధ్య సాగింది. తమ అభిమాన నేతను కడసారి చూసేందుకు ప్రజలు, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కన్నీటి సంద్రం నడుమ ఆయనకు వీడ్కోలు పలికారు. శనివారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నారా రామ్మూర్తి నాయుడు(71) తుది శ్వాస విడిచారు. ఆదివారం ఉదయం ఆస్పత్రి నుంచి ప్రత్యేక విమానంలో ఆయన పార్థీవ దేహాన్ని మంత్రి నారా లోకేష్, కుటుంబ సభ్యులు రేణిగుంట విమానాశ్రయానికి తీసుకొచ్చారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన నారావారిపల్లికి చేరుకుని, తన నివాసం వద్ద ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఉదయం 11.20 గంటలకు సీఎం చంద్రబాబు నాయుడు నారావారిపల్లికి చేరుకున్నాడు. తన తమ్ముడు మృతి చెందడంతో తీవ్ర దిగ్భ్రాంతికి లోనైన సీఎం, తన కుటుంబ సభ్యులతో కలసి పుష్పగుచ్ఛం అందించి నివాళులర్పించారు.

పలువురు ప్రముఖుల నివాళి

మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడుకు ఆదివారం తన స్వగృహం వద్ద పలువురు నివాళులర్పించారు. ఇందులో మహారాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్, ప్రముఖ నటులు మంచు మోహన్‌బాబు, రాజేంద్ర ప్రసాద్, మంచు మనోజ్, శ్రీవిష్ణు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, మాజీ టీటీడీ చైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి, ఎమ్మెల్యేలు దేవినేని ఉమ, కలికిరి మురళీమోహన్, పులివర్తి నాని, అమరనాథరెడ్డి, గురజాల జగన్‌మోహన్‌రావు, చింతమనేని ప్రభాకర్, కురుగొండ్ల రామకృష్ణ, ఆదిమూలం, బొజ్జల సుధీర్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న నారా రోహిత్

రామ్మూర్తి నాయుడుకు ప్రభుత్వం అధికార లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించింది. మధ్యాహ్నం 2.30 గంటలకు ఇంటి వద్ద నుంచి అంతిమయాత్రను ప్రారంభించారు. గ్రామ సమీపంలోని తల్లిదండ్రుల సమాధుల సమీపంలోని మామిడితోటలో ఏర్పాటు చేసిన ప్రాంతానికి తీసుకొచ్చారు. హిందూ సంప్రదాయ ప్రకారం కార్యక్రమాలను నిర్వహించారు. ఆయన తనయుడు, హీరో నారా రోహిత్ తన తండ్రికి అంతిమ సంస్కారాన్ని నిర్వహించారు. అనంతరం అక్కడే కుటుంబ సభ్యులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు మూడు రౌండ్లు గాల్లో కాల్పులు జరిపి, రామ్మూర్తినాయుడుకు ఘన నివాళులర్పించారు. రేపు ఉదయం సీఎం చంద్రబాబు నారావారిపల్లి నుంచి తిరిగి వెళ్లనున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి.

తవ్వేస్తూ.. తరలిస్తూ..!

ప్రజలు ఇబ్బంది పడినా లెక్కలేదు.. రహదారులు ధ్వంసమైనా లక్ష్యం లేదు.. ప్రమాదాల బారిన పడి ప్రాణాలు పోతున్నా పట్టించుకునే ప్రసక్తే లేదు.. ప్రకృతి వనరులు నాశనమైనా పర్వాలేదు. తమ జేబులు నిండితే చాలు.. సులువుగా కాసులు రాలితే అదే పదివేలు అన్నట్టు తయారైంది కూటమి నేతల వ్యవహారం. రూ.కోట్లు కూడబెట్టుకోవడమే ధ్యేయంగా ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు. ముఖ్యంగా స్వర్ణముఖి నదిలో యంత్రాల సాయంతో యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తున్నారు. ఇష్టారాజ్యంగా ట్రాక్టర్లతో తరలించి అమ్మేస్తున్నారు. ఇసుకాసురుల జోరుకు గ్రామీణ రహదారులు ఛిద్రమవుతున్నాయి. పల్లెవాసులను తీవ్రంగా ఇబ్బందిపెడుతున్నాయి.

- ఆగని ఇసుక అక్రమ రవాణా
- స్వర్ణముఖిలో నీరు ఉన్నా లెక్కచేయని కూటమి నేతలు
- ట్రాక్టర్ల జోరుకు ఛిద్రమవుతున్న గ్రామీణ రహదారులు



ఇసుక ట్రాక్టర్ల కారణంగా ఛిద్రమైన పాపానాయుడుపేట- చెన్నంపల్లె రహదారి

రేణిగుంట (ఏర్పేడు) : శ్రీకాళహస్తి నియోజక వర్గ పరిధిలో ఇసుక అక్రమ రవాణా అగడం లేదు. కూటమి నేతలు స్వర్ణముఖి నదిలో ఇసుకను తవ్వి తరలించి సొమ్ముచేసుకుంటున్నారు. అక్రమ రవాణాకు గ్రామీణ రహదారులు ఛిద్రమవుతున్నాయి. దీంతో ఈ మార్గాల్లో ప్రయాణించే స్కూలు పిల్లలు తరచూ ప్రమాదాల బారినపడుతున్నారు. శ్రీకాళహస్తి- కాసరం మార్గంలోని దొమ్మరపాళెం వద్ద ఇసుక ట్రాక్టర్ ఢీ కొని చియ్యవరం గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు మరణించిన ఘటనలు చోటు చేసుకున్నా.. అక్రమార్కుల ఆగడాలు ఆగడం లేదు. సంబంధిత అధికాకారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. అలాగే ఏర్పేడు మండలం పాపానాయుడుపేట–చెన్నంపల్లె మార్గంలోని స్వర్ణముఖి నదిలో టీడీపీ నాయకులు ఇసుకను యథేచ్ఛగా దోచేస్తున్నారు. నదిలో నీరు ప్రవహిస్తున్నా.. ఇసుక తవ్వకాలు ఆపడం లేదు. ఉదయం నుంచి రాత్రి వరకు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించేస్తున్నారు. ఫలితంగా పాపానాయుడుపేట- చెన్నంపల్లె మార్గం గుంతలమయంగా మారిపోయింది. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ క్రమంలోనే శనివారం పాపానాయుడుపేటలోని జెడ్పీ హైస్కూల్‌కు సైకిల్‌పై వెళుతున్న ఇద్దరు విద్యార్థులు కిందపడి గాయాల పాలయ్యారు. ఆదివారం కూడా ఇసుక తవ్వకాలు జరుగుతుండడంతో చెన్నంపల్లె వాసులు అక్రమ రవాణాను అడ్డుకున్నారు. అలాగే శ్రీకాళహస్తి- పెద్దకనపర్తి, కాసరం, పూడి–పెన్నలపాడు, విరూపాక్షపురం సమీపంలోని స్వర్ణముఖి నదిలోనూ ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఇసుక ట్రాక్టర్ల జోరుకు పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొత్తకండ్రిగ సమీపంలో రెండు రోజుల క్రితం ఇసుక అక్రమ రవాణాకు ఛిద్రమైన రహదారిలో ప్రయాణిస్తున్న భార్య భర్తలు కిందపడి గాయాలపాలయ్యారు. అదే విధంగా పూడి సమీపంలో ఇసుక ట్రాక్టర్ వేగానికి దంపతులు గాయపడ్డారు. సంబంధిత అధికారులు స్పందించకపోతే ఇసుక అక్రమ రవాణాతో మరింత మంది ప్రమాదాలకు బలికావాల్సి వస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



స్వర్ణముఖి నదిలో నుంచి ఇసుక లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్



ఇసుక ట్రాక్టర్లను అడ్డుకుంటున్న చెన్నంపల్లెవాసులు

భావి తరాల కోసం కళల పరిరక్షణ

తిరుపతి కల్చరల్ : భారతీయ సంస్కృతికి, సాంప్రదాయానికి మార్గదర్శకమైన కళలను పరిరక్షించి భావితరాలకు అందించాలని వేదిక్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ రాణి సదాశివమూర్తి తెలిపారు. టీటీడీ హిందూ ధర్మపరిషత్ సౌజన్యంతో శ్రీపద్మనాభ నేషనల్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ వారు మహతి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న నాటకోత్సవాలు ఆదివారం రెండవ రోజుకు చేరుకున్నాయి. ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ రామాయణం, భారతం, భాగవతం వంటి ఇతిహాసాలను తెలిపే కళారూపాల వైభవాన్ని మరింత విస్తృతం చేయాల్సిన అవసరముందన్నారు. అనంతరం అతిథితో పాటు కళాకారులను జ్ఞాపికలతో నిర్వాహకుడు కస్తూ పద్మనాభన్ ఘనంగా సత్కరించారు. గుండాల గోపీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



కళాకారులతో అతిథులు, నిర్వాహకులు

క్లుప్తంగా

2 నుంచి దివ్యాంగుల క్రీడాపోటీలు

తిరుపతి సిటీ: ఆంధ్రప్రదేశ్ పారా సిట్టింగ్ వాలీబాల్ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వచ్చే నెల 2, 3 తేదీల్లో దివ్యాంగులకు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా కో-ర్డినేటర్ నాగరాజు తెలిపారు. పోటీలను తుని జిల్లాలోని పాయకరావుపేటలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి ఆసక్తిగల దివ్యాంగులు పాల్గొనవచ్చని, పాల్గొనే జట్లు తమ వివరాలను ముందుగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వివరాల కోసం 9985882559, 9985568249 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఆరుగురిపై వేటు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ఆరుగురిపై వేటు పడింది. ఆలయంలో సెల్‌ఫోన్ వినియోగించరాదనే నిబంధన అమల్లో ఉంది. అయితే ఆదివారం ఈవో బాపిరెడ్డి తనిఖీలు చేయగా సెల్‌ఫోన్ వినియోగిస్తున్న ఆరుగురిపై చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా హోంగార్డును మాతృశాఖకు సరెండర్ చేశారు. అదే విధంగా ఒప్పంద ప్రతిపాదికన విధులు నిర్వహిస్తున్న అటెండర్‌ను సస్పెండ్ చేశారు. నలుగురు సెక్యూరిటీ గార్డులను విధుల నుంచి తొలగించారు.

వృద్ధురాలికి గాయాలు


గాయపడిన సావిత్రమ్మ

పాకాల: ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధురాలికి గయాలైన ఘటన మండలంలోని అచ్చమ్మ అగ్రహారం ఎస్సీ కాలనీ సమీపంలో చోటుచేసుకుంది. ఆదివారం స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. లింగనపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు జీ.సావిత్రమ్మ లింగనపల్లి నుంచి అచ్చమ్మ అగ్రహారం సబ్ స్టేషన్ వద్ద గల చర్చికి వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ద్విచక్ర వాహనంలో వేగంగా నేంద్రగుంట నుంచి పెనుమూరు వైపు వెళుతున్న యువకుడు సావిత్రమ్మను ఢీకొని వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. గాయపడిన వృద్ధిరాలిని 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పాకాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హార్స్‌పవర్.. అదుర్స్!

తిరునగరి ఖ్యాతిని ఎన్‌సీసీ క్యాడెట్లు జాతీయ స్థాయిలో ఇనుమడింపజేస్తున్నారు. ఢిల్లీలో నిర్వహించే రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికవుతున్నారు. ముఖ్యంగా హార్స్‌వింగ్‌లో సత్తా చాటుతున్నారు. గుర్రపు స్వారీ చేస్తూ అబ్బుర పరిచే విన్యాసాలను అవలీలగా చేసేస్తున్నారు. గణతంత్ర వేడుకల్లో ఉత్తమంగా రాణించేందుకు కఠోర శిక్షణ పొందుతున్నారు. ఎర్రకోటపై రెపరెపలాడుతున్న మువ్వన్నెల జెండాకు గౌరవ వందనం సమర్పించే మహద్భాగ్యం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఉప్పొంగే దేశభక్తితో ఉత్సాహంగా కదం తొక్కుతున్నారు.

- ఢిల్లీ రిపబ్లిక్‌డే పరేడ్‌కు తిరుపతి ఎన్‌సీసీ క్యాడెట్లు
- హార్స్ వింగ్‌లో ఎంపికైన ఆరుగురు విద్యార్థులు
- సత్తా చాటేందుకు సికింద్రాబాద్ పీఆర్‌డీసీలో కఠోర శిక్షణ


పరేడ్ రిహార్సల్‌లో ఎన్‌సీసీ క్యాడెట్లు


శిక్షణలో హార్స్‌రైడింగ్‌కు సిద్ధమవుతున్న క్యాడెట్లు

తిరుపతి సిటీ : తిరుపతి 2ఏ ఆర్ అండ్ బీ రెజిమెంట్ ఆధ్వర్యంలో వెటర్నరీ కళాశాలలోని హార్స్‌వింగ్ సెంటర్ నుంచి ఎన్‌సీసీ క్యాడెట్లు ఏటా జనవరి 26వ తేదీన ఢిల్లీ నిర్వహించే రిపబ్లిక్‌డే పరేడ్‌కు ఎంపికవుతున్నారు. హార్స్‌వింగ్‌లో తెలుగు రాష్ట్రాల నుంచి అతి తక్కువ సంఖ్యలో ఎంపికయ్యే పరేడ్‌కు తిరుపతి ఎన్‌సీసీ క్యాడెట్లు ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ క్రమం తప్పకుండా ముగ్గురు విద్యార్థులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ క్రమంలోనే 2025 జనవరి 26న జరగనున్న రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎస్వీ ఆర్ట్స్ కళాశాల నుంచి నలుగురు డిగ్రీ విద్యార్థులు ఎంపికయ్యారు. అలాగే వెటర్నరీ కళాశాల నుంచి బీవీఎస్సీ చదువుతున్న ఇద్దరు మహిళా క్యాడెట్లు సైతం చోటు దక్కించుకున్నారు.

సికింద్రాబాద్‌లో శిక్షణ

తిరుపతి రెజిమెంట్ నుంచి రిపబ్లిక్‌డే పరేడ్‌లో పాల్గొనేందుకు సుమారు 320మందికి పైగా గుర్రపు విన్యాసాలు, డ్రిల్‌లో శిక్షణ పొందారు. ఇందులో ఎన్‌సీసీ అధికారులు పలు రకాల ఈవెంట్స్, పరీక్షల అనంతరం ప్రతిభ చూపిన ఆరుగురిని మాత్రమే ప్రీ రిపబ్లిక్‌డే క్యాంప్‌నకు (పీఆర్‌డీసీ) ఎంపికచేశారు. ప్రస్తుతం వీరు సికింద్రాబాద్‌లోని హార్స్‌వింగ్‌లో కఠోర శిక్షణ పొందుతున్నారు. అనంతరం ఆరుగురిలో ప్రతిభ చూపిన ముగ్గురు క్యాడెట్లను ఢిల్లీకి పంపనున్నారు. పీఆర్‌డీసీకి ఎంపికైన ప్రతి ఎన్‌సీసీ విద్యార్థికీ మెడల్స్‌తో పాటు, జాతీయ స్థాయి గుర్తింపు ధ్రువీకరణపత్రాలను అందజేయనున్నారు. దీంతో ఎన్‌సీసీ కోటాలో విద్యార్థులకు ఉన్నత చదువులోనూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలోనూ ప్రత్యేక రిజర్వేషన్ పొందే అవకాశముంటుంది

సమాచారం

సంవత్సరం	పీఆర్‌డీసీకి ఎంపికైనవారు	పరేడ్‌లో పాల్గొన్నవారు
2021	05	02
2022	09	04
2023	10	04
2024	09	03
2025	06	03

సంతోషంగా ఉంది



మాది అనంతపురం జిల్లా. ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో ఫైనల్ బీకామ్ చదువుతున్నా. సాధారణ వ్యవసాయ కుటుంబం. ఎంతోమంది సైనికులు దేశసేవకు అంకితమవడం నన్ను ఎన్‌సీసీలో చేరేందుకు ప్రేరేపించింది. దీంతో తిరుపతి ఎన్‌సీపీ హార్స్‌వింగ్‌లో మూడు ఏళ్లపాటు శిక్షణ తీసుకుని పలు ఈవెంట్స్‌లో తర్ఫీదు పొందా. ప్రస్తుతం పీఆర్‌డీసీకి ఎంపిక అవడం సంతోషంగా ఉంది. పరేడ్‌లో పాల్గొని జాతీయ జెండాకు, రాష్ట్రపతికి గౌరవవందనం చేయాలని ఉంది.

- మనోజ్, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల

దేశ భక్తి.. క్రమశిక్షణే లక్ష్యం



దేశభక్తి, క్రమశిక్షణను విద్యార్థులకు అలవరచడమే ఎన్‌సీసీ లక్ష్యం. ఇందులో భాగంగా తిరుపతి 2ఏ ఆర్అండ్‌బీ ఎన్‌సీసీ రెజిమెంట్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలలు, కళాశాలల్లో వేల మంది విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అందిస్తున్నాం. ఎన్‌సీసీ కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు బీ, సీ సర్టిఫికెట్లు అందజేస్తున్నాం. ఎంతో మంది ఎన్‌సీసీ కోటాలో ఉద్యో గాలు, ఉన్నత విద్యలో ప్రవేశాలు పొందారు. ప్రస్తు తం తిరుపతి నుంచి 6 మంది హార్స్‌రైడర్స్ పీఆర్‌డీసీకి ఎంపికయ్యారు. వారిలో ముగ్గురు ఢిల్లీకి వెళతారు.

- కల్నల్ ఆర్.అనూప్, కమాండింగ్ ఆఫీసర్

గుర్రపుస్వారీపై మక్కువతో...



మాది గుంటూరు. ఫర్టిలైజర్స్ వ్యాపారం. చిన్నప్పటి నుంచి గుర్రపు స్వారీ అంటే చాలా ఇష్టం. వెటర్నరీ కళాశాలలో బీవీఎస్సీ కోర్సులో అడ్మిషన్ పొందిన వెంటనే అదే క్యాంపస్‌లోని ఎన్‌సీసీ హార్స్‌వింగ్‌లో చేరా. హార్స్‌రైడింగ్‌లోని పలు విభాగాలలో శిక్షణ పొందా. క్రమశిక్షణతోపాటు, దేశభక్తి ఉట్టిపడేలా కఠోర శిక్షణ ఇచ్చారు. పీఆర్‌డీసీ ఎంపికవడం సంతోషంగా ఉంది. ఢిల్లీ పరేడ్‌లో రాణించి గుర్తింపు పొందాలన్నదే లక్ష్యం.

- బిందు, ఎస్వీ వెటర్నరీ కళాశాల

అదృష్టంగా భావిస్తున్నా



మాది వైజాగ్, వ్యవసాయ కుటుంబం. ఎస్వీ వెటర్నరీ కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్‌లో అడ్మిషన్ పొందా. ఎన్‌సీసీ క్యాడెట్‌గా చేరిపోయా. ఎన్‌సీసీ అధికారులు ఉత్తమ శిక్షణను అందించారు. పీఆర్‌డీసీకి ఎంపిక కావడం అదృష్టంగా భావిస్తున్నా. దేశం గర్వించేలా రిపబ్లిక్‌డే పరేడ్‌లో పాల్గొని జాతీయ పతాకానికి వందనం చేస్తా.

- అంజలి, ఎస్వీ వెటర్నరీ కళాశాల

ఎన్‌సీసీ అంటే ప్రాణం



మాది కర్నూలు. నాన్న ఆర్మీలో పనిచేసి రిటైర్డ్ అయ్యారు. ఆయన దేశభక్తి, క్రమశిక్షణను చూసి చిన్నప్పటి నుంచి ఎన్‌సీసీలో చేరాలని బలమైన కోరిక ఏర్పడింది. ఎన్‌సీసీ హార్స్ వింగ్‌లో చేరేందుకు తిరుపతి చక్కటి వేదికగా గుర్తించి ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో చేరా. ఇక్కడి అధికారులు ప్రతి క్యాడెట్‌కు ప్రత్యేకంగా కేర్ తీసుకుని శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం పీఆర్‌డీసీ స్థాయికి చేరుకున్నా. పరేడ్‌లో పాల్గొనే అవకాశం దక్కుతుందని ఆశిస్తున్నా.

- మహిమరాజు, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల

గర్వంగా ఉంది



మాది శ్రీకాళహస్తి. రైతు కుటుంబం. ఎన్‌సీసీలో చేరి త్రివిధ దళాలలో ఉన్నత ఉద్యోగం సాధించాలనే కోరికతో హార్సివింగ్ ఎంపిక చేసుకున్నా. ఎన్‌సీసీ అధికారుల శిక్షణ మరువలేనిది. జాతీయ స్థాయిలో ప్రీ పరేడ్ క్యాంపునకు ఎంపికకావడం గర్వంగా ఉంది. క్యాంపులో ప్రతిభ చూపి రాష్ట్రపతికి గౌరవ వందనం చేసే అదృష్టం కోసం ఎదురుచూస్తున్నా.

- వి.లోకేష్, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల

మూడేళ్లుగా శిక్షణ



చంద్రగిరి సమీపంలోని నరసింగాపురం మా సొంత ఊరు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చా. ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్నా. గత మూడు ఏళ్లుగా హార్స్‌వింగ్‌లో ఎన్‌సీసీ క్యాడెట్‌గా శిక్షణ తీసుకున్నా. ఈ ఏడాది సెలక్షన్స్‌లో పీఆర్‌డీసీకి ఎంపికయ్యా. త్వరలో జరిగే ఫైనల్ సెలక్షన్స్‌లో ప్రతిభ చూపి ఢిల్లీ పరేడ్‌లో పాల్గొంటాననే నమ్మకముంది.

- హర్షవర్ధన్, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల

ప్రాణం తీసిన వేగం!

చెట్టును ఢీకొన్న వ్యాను

- ఇద్దరి మృతి
- శ్రీసిటీ ట్రిపుల్ ఐటీ సర్కిల్ వద్ద ప్రమాదం
- మృతి చెందిన వారు బీహార్ వాసులుగా గుర్తింపు


ప్రమాదంలో మృతి చెందిన డ్రైవర్ అజేయ్‌రామ్, బిహార్ వాసి మనోజ్ సింగ్

శ్రీసిటీ (వరదయ్యపాళెం): పరిశ్రమలకు ఆహార పదార్థాలు తీసుకువెళ్లే మినీ వ్యాను అత్యంత వేగంగా వెళ్తూ రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శ్రీసిటీ ట్రిపుల్ ఐటీ కూడలి వద్ద చోటు చేసుకుంది. శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన మేరకు వివరాలు.. తడకు చెందిన కేఏఆర్ ఫుడ్ క్యాటరింగ్ సర్వీసెస్‌కు చెందిన వ్యాను రోజువారీ శ్రీసిటీలోని కొన్ని పరిశ్రమలకు ఆహార పదార్థాలను సరఫరా చేస్తోంది. ఆ దిశగా ఆదివారం మధ్యాహ్నం పరిశ్రమలకు ఆహార పదార్థాలను అందజేసి తిరుగు ప్రయాణంలో ట్రిపుల్ ఐటీ కూడలి వద్ద వేగంగా వచ్చి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో వాహనాన్ని నడుపుతున్న అజేయ్‌రామ్ (42), అదే వాహనంలో సహాయకుడుగా ఉన్న మనోజ్ సింగ్ (52)కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. మృతి చెందిన వీరిద్దరూ కూడా బీహార్‌కు చెందిన వలస కూలీలు. బతుకు దెరువు కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చి మృతి చెందడంతో సమాచారం అందుకున్న వారి కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. శ్రీసిటీ ఎస్ఐ హరిప్రసాద్, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసి శవపంచనామా నిమిత్తం మృతదేహాలను సత్యవేడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రాయలసీమకు చంద్రబాబు తీరని ద్రోహం


మాట్లాడుతున్న వైఎస్ఆర్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.మనోహర్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: రాయలసీమకు సీఎం చంద్రబాబు మరింత ద్రోహం చేసే చర్యలకు పాల్పడడం దుర్మార్గమని వైఎస్ఆర్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.మనోహర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమన్యాయం పాటిస్తూ అన్ని ప్రాంతాలను అభివృద్ధి పథంలో నడపాలనే కాంక్షతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలు న్యాయ రాజధానిని చేసేందుకు కృషి చేశారన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వీటిని అమరావతికి తరలిస్తూ నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమన్నారు. కొప్పర్తిలో రూ.250 కోట్ల నిధులతో ఇండస్ట్రీస్ ఏర్పాటుకు గత ప్రభుత్వం చర్యలు తీసుకుంటే కూటమి ప్రభుత్వం దీనినికూడా అమరావతికి తరలించడం సిగ్గుచేటన్నారు. గత 2014 నుంచి 2018వరకు చంద్రబాబు హయాంలో రాయలసీమకు ఒరబెట్టింది ఏమీ లేదన్నారు. రాయలసీమ అభివృద్ధికి వైఎస్ఆర్‌సీపీ చేపట్టిన చర్యలను నీరుగార్చుతూ సీఎం చంద్రబాబు రాయలసీమకు దగా చేశారని విమర్శించారు. అంతేకాక ప్రభుత్వం తప్పులను ప్రశ్నించే గొంతులను సైతం అణచివేతకు గురిచేస్తూ అరాచకాలు సృష్టిస్తున్నారన్నారు. సోషియల్ మీడియాను సాకుగా చూపుతూ ప్రతిపక్షాన్ని అణచివేతకు గురి చేయాలని చూస్తున్నారన్నారు. అశ్లీల, అసభ్యకర పోస్టులు పెడుతున్న కూటమి కార్యకర్తలను విస్మరించి ప్రభుత్వం తప్పులు ఎత్తి చూపే వారిపై కక్ష సాధింపులకు పాల్పడడం దుర్మార్గమన్నారు. సమావేశంలో వైఎస్ఆర్‌సీపీ లీగల్ సెల్ ప్రతినిధులు నరహరిరెడ్డి, రవిచంద్రారెడ్డి, రాజశేఖర్, చంద్రశేఖర్‌రెడ్డి, సోమేశ్వరన్, శ్రీరాములు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు ఆధార్ తప్పనిసరి

తిరుపతి క్రైమ్: ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే మీకోసం – ప్రజా పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదుదారులు ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన సూచించారు.

వివాహిత ఆత్మహత్య


సౌజన్య(ఫైల్)

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం, సాయినగర్ పంచాయతీలో వివాహిత సౌజన్య(27) ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లోనే ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. ఆమె భర్త రవీంద్రరెడ్డి తిరుపతి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



చిల్లకూరు : గూడూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి(45) ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు. నెల్లూరు- చెన్నై జాతీయ రహదారిపై చిల్లకూరు పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోని దుకాణాల వద్ద రెండు రోజుల క్రితం ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండగా 108లో ఆస్పత్రికి తరలించామన్నారు. ఈ క్రమంలో సదరు వ్యక్తి మరణించినట్లు వెల్లడించారు. మృతుడి చేతిపై శివుడి పచ్చబొట్టు ఉందని, వివరాలు తెలిసిన వారు తమకు సమాచారం అందించాలని కోరారు.

గుర్తుతెలియని మృతదేహాలు లభ్యం

వాకాడు: మండల పరిధిలోని రెండు గ్రామాలలో గుర్తుతెలియని రెండు మృతదేహాలను పోలీసులు గుర్తించారు. పోలీసుల వివరాల మేరకు.. వాకాడు మండలం, అంజలాపురం గ్రామ చివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. అలాగే దుగ్గరాజపట్నం-మల్లాం గ్రామాల మధ్య కొత్తూరు వద్ద మరో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం పడి ఉండడంతో పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు అతనిని ఎవరో హత్య చేసి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. మృతుని వివరాలు తెలియరాలేదని, ఎవరికై నా తెలిస్తే వాకాడు పోలీసులకు 9440796352 సమాచారం ఇవ్వాలని ఎస్ఐ నాగబాబు కోరారు.

పిల్లలను తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

తిరుపతి (అలిపిరి) : పరిశ్రమల్లో పనిచేసేందుకు అక్రమంగా తరలిస్తున్న 8 మంది పిల్లలను రైల్వేపోలీసులు రక్షించి, ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వివరాలు.. ఆదివారం హజ్రత్ నిజాముద్దీన్-తిరువనంతపురం ఎక్స్‌ప్రెస్‌లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఏఏహెచ్‌టీ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడుగురు బాలురు, ఓ బాలికను గుర్తించారు. పిల్లల తల్లిదండ్రులను ఏజెంట్లు మభ్య పెట్టి నాగపూర్‌లో రైలు ఎక్కించినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలోనే తమ సంరక్షణలోకి తీసుకున్న పిల్లలను తిరుపతిలోని ప్రభుత్వ బాలుర వసతి గృహం,బాలికల వసతి గృహానికి అప్పగించారు.

నవజాత శిశువుల రక్షణపై అవగాహన


5కే వాక్ ప్రారంభిస్తున్న మేయర్ శిరీష

- విజయవంతంగా '5కే వాక్'

తిరుపతి తుడా : నవజాత శిశువుల రక్షణపై అవగాహన కల్పించేందుకు ఆదివారం తిరుపతిలో నిర్వహించిన 5కే వాక్ విజయవంతమైంది. ఉదయం 6.30గంటలకు మేయర్ శిరీష జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. తెలుగుతల్లి విగ్రహం నుంచి అంకుర హాస్పిటల్ వరకు ర్యాలీ కొనసాగింది. మేయర్ మాట్లాడుతూ నెలలు నిండకముందే జన్మించిన నవజాత శిశువులకు తలెత్తే సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించడం సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. అమ్మ గర్భంలో బిడ్డ ఎదగడానికి నవ మాసాల గడువు ఉంటుందని, అంతకంటే ముందుగానే శిశువు జన్మిస్తే పలు రకాల సమస్యలు తలెత్తే ప్రమాదముందని తెలిపారు. ఒకప్పుడు నెలలు నిండని పిల్లలకు చికిత్స అంతంత మాత్రమే ఉందని, ఇప్పుడు ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చిందని వెల్లడించారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్ (ఐఏపీ) జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఏఆర్ రెడ్డి మాట్లాడుతూ నవజాత శిశువులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏటా నవంబర్ 17వ తేదీన ప్రపంచ ప్రీమెచ్యూరిటీ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐఏపీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వీఎస్ అంజన్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ముందస్తు జననం, నెలలు నిండని శిశువులు, వారి కుటుంబాల ఆందోళనపై అవగాహన కల్పించడానికి నేడు ఈ కార్యక్రమాన్ని జరుపుకుంటున్నారని వివరించారు. అంకుర హాస్పిటల్స్ తిరుపతి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడతూ ఏటా లక్షల మంది పిల్లలు ముందస్తుగా పుడుతున్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా జన్మిస్తున్న 10 మంది శిశువులలో ఒకరు ప్రీటర్మ్ బేబీ ఉన్నట్లు వివరించారు. నియోనటాలజిస్ట్ డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ ప్రపంచంలో ఐదేళ్ల కంటే తక్కువ వయసున్న పిల్లల మరణాలకు నెలలు నిండని జననమే కారణమని తెలిపారు. గైనకాలజిస్ట్ డాక్టర్ రేష్మారెడ్డి మాట్లాడుతూ నవజాత శిశువులను పరిరక్షించుకునేందుకే ప్రీ మెచ్యూర్ డే నిర్వహిస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో ఐఏపీ ట్రెజరర్ డాక్టర్ సతీష్ బిల్లా, డాక్టర్ తేజస్విని, డాక్టర్ దినేష్, డాక్టర్ పృథ్వీ, డాక్టర్ రవిచంద్ర, డాక్టర్ పార్థసారథి, డాక్టర్ రవిచంద్ర పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఆలయ కుంభాభిషేకం


ఆలయంలో ఎంపీ గురుమూర్తి, వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు వడ్డిపాళెంలో నూతనంగా నిర్మించిన శ్రీ భూమి నీలాదేవి సమేత శ్రీనివాస ఆలయ కుంభాభిషేక ఉత్సవాలు మూడో రోజు ఆదివారం అత్యంత వైభవోపేతంగా జరిగాయి. స్వామివారికి ఉదయం భూపాలసేవ, మహాసంప్రోక్షణ పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి విశ్వశాంతి పరిణయ ఉత్సవం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పార్టీ శ్రేణులతో కలసి ఆలయ కుంభాభిషేక ఉత్సవాల్లో పాల్గొన్నారు. వారికి వేద పండితులు పూర్ణాకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు సుబ్రమణ్యం, మాధవయ్య, మహేంద్ర, వెంకటేష్ శాలువాలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, మాజీ కార్మిక విభాగం అధ్యక్షులు బీరేంద్రవర్మ, ఎంపీపీ భర్త దామోదర్‌రెడ్డి, సీనియర్ నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, సోషల్ మీడియా జిల్లా కో-కన్వీనర్ రాకేష్, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, మాజీ సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, పార్టీ నాయకులు చిలమత్తూరు భాస్కర్ రెడ్డి, వినోద్‌యాదవ్, రమణయ్య, శోభన్‌యాదవ్, దుద్దువేణు, శిబిచక్రవర్తి, సుబ్రమణ్యంరెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

వేడుకల్లో పలువురు ప్రముఖులు

కుంభాభిషేక ఉత్సవాల్లో శ్రీసిటీ డైరెక్టర్ ముకుందరెడ్డి, పెద్ద పాండూరుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త విజయ్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.